# నమస్తే ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 348 | పేజీలు: 4 | వెల: రూ.4/- | ఆదివారం 3 ఆగస్టు 2025 | ఎడిటర్: ఎం.వనితా రెడ్డి


## 20వ విడత కిసాన్ సమ్మాన్ నిధి విడుదల

### వారణాసి పర్యటనలో ప్రారంభించిన ప్రధాని మోడీ

న్యూఢిల్లీ, ఆగస్టు 2 (నమస్తే ఉదయం)

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారణాసి నుంచి పీఎం కిసాన్ సమ్మాన్ నిధి యోజన 20వ విడత మొత్తాన్ని విడుదల చేశారు. సేవాపురిలోని బనౌలిలో జరిగిన కార్యక్రమంలో ఈ విడతను అధికారికంగా విడుదల చేశారు. ఈసారి దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల బ్యాంకు ఖాతాల్లోకి నేరుగా రూ.20,000 కోట్లు బదిలీ అయ్యాయి. ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి మూడు విడతల్లో రూ.6,000 ఆర్థిక సాయం అందుతుంది. అంటే, ఒక్కో విడతలో రూ.2,000 చొప్పున నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లోకి జమ అవుతాయి. అంతకుముందు, జూన్ 18, 2024న, ప్రధానమంత్రి మోదీ నుంచి రూ.9.26 కోట్ల మంది రైతుల ఖాతాలకు సమ్మాన్ నిధిని రిలీజ్ చేశారు.

# మోడీని గద్దెదించడం

# రాహుల్‌కు మాత్రమే సాధ్యం



### దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి
### దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన పార్టీ కాంగ్రెస్
### పదవులను త్యాగం చేసిన ఘనత సోనియాది
### రాహుల్‌ను ప్రధానిని చేస్తామని తెలంగాణ పక్షాన హామీ
### 75 ఏళ్ల నిబంధన పెట్టినా పదవి వదలని నేత మోడీ
### మోడీని గద్దెదించడం కేవలం రాహుల్‌కు మాత్రమే సాధ్యం
### కాంగ్రెస్ న్యాయ సదస్సులో సిఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ, ఆగస్టు 2 (నమస్తే ఉదయం)

దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న పార్టీ కేవలం కాంగ్రెస్ పార్టీ మాత్రమేనని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికల్లో రాహుల్‌ను ప్రధానిని చేయడమే లక్ష్యమని అన్నారు. దిల్లీలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ వార్షిక న్యాయ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశానికి స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీ కాంగ్రెస్ అని.. భాజపా, భారత రాష్ట్ర సమితి, జేడీ, బీజేడీ, ఆర్‌జేడీ.. ఏ పార్టీ అయినా స్వాతంత్ర్యం తర్వాతే వచ్చాయని తెలిపారు. ఇతర పార్టీలు ఎన్నికల్లో గెలిస్తే కుర్చీలో, ఓడితే ఇంట్లో కూర్చుంటాయి. ఎన్నికల్లో ఓడినా,గెలిచినా ప్రజల మధ్యే ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ అన్నారు. మోదీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని,11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించట్లేదని అన్నారు. వక్రమార్గంలో ఉన్న నేతలను రెండు చెంపదెబ్బలు కొట్టయినా దారిలోకి తెచ్చేందుకు కాంగ్రెస్ కృషి చేస్తోంది. మా పార్టీ దేశానికి ఏం చేసిందని విమర్శిస్తున్నారు. 140 ఏళ్ల క్రితం దేశ ప్రజల స్వాతంత్ర్యం కోసం కదం తొక్కింది. ఆంగ్లేయులను ఓడించింది. భారత్ నుంచి ఉగ్రవాదులను పారద్రోలేందుకు ఇందిరాగాంధీ కృషి చేశారు. దేశం కోసం ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ అమరులయ్యారు. యూపీఏ-1 సమయంలో సోనియాగాంధీ ప్రధాని కావాలని అందరూ కోరారు. కానీ, ప్రధాని పదవిని ఆమె త్యాగం చేశారు. 2004లోనే రాహుల్‌గాంధీ కేంద్ర మంత్రి అయ్యేవారు. ఆయన కోరుకుంటే 2009లోనే ప్రధాని అయ్యేవారు. కానీ ప్రధాని, కేంద్ర మంత్రి పదవులు పార్టీ సీనియర్ నేతలకు ఇచ్చారు. కార్యకర్తగానే ప్రజల కోసం రాహుల్‌గాంధీ పనిచేశారు. సామాజిక న్యాయం కోసం 25 ఏళ్లుగా పోరాడుతున్నారు. మరోవైపు నరేంద్ర మోదీ 25 ఏళ్లుగా కుర్చీ వదలట్లేదు. 2001లో సీఎం అయినప్పటి నుంచి ఆయన కుర్చీలోనే ఉన్నారు. భాజపా సంఘ్ పరివార్ మోదీని తప్పించేందుకు ప్రయత్నించింది. కానీ అందుకు ఆయన రాజీ పడలేదు. 75 ఏళ్లు దాటిన వ్యక్తులు కుర్చీ వీడాలని మోహన్ భగవత్ చెప్పారు. కానీ 75 ఏళ్లు దాటినా.. మోదీ అందుకు సిద్ధంగా లేదు. ఇదే నిబంధనతో అద్వాణీ, మనోహర్ జోషిని తప్పించారు. మోదీని సీఎం పదవి నుంచి తప్పించేందుకు గతంలో వాజ్‌పేయీ, ప్రధాని పదవి నుంచి తప్పించేందుకు మోహన్ భాగవత్ ప్రయత్నించారు. ఆయన్ను తప్పించడం వారి వల్ల కాలేదు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీకి వ్యతిరేకంగా రాహుల్‌గాంధీ పోరాటం విజయవంతం కాబోతుందని అన్నారు. దేశంలో సామాజిక న్యాయం, దళితులు, ఆదివాసీల సంక్షేమం కోసం కృషి చేసింది కాంగ్రెస్ పార్టీ అని, రేవంత్ రెడ్డి కొనియాడారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలో రాజ్యాంగం ప్రమాదంలో ఉందని, 11 ఏళ్లుగా సామాజిక న్యాయం కోసం ఆలోచించడంలేదని, దేశానికి మార్గదర్శనం కోసం మనుసింఘ్వి నేతృత్వంలో సదస్సు నిర్వహించడం గొప్పవిషయమన్నారు. సామాజిక న్యాయాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు కార్యాచరణ చేస్తున్నామన్నారు. తెలంగాణ ప్రజల పక్షాన చెబుతున్నా.. రాహుల్ గాంధీని భారత ప్రధానిని చేసి తీరుతామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. గతంలో దేశానికి ప్రధాని అయ్యే ఛాన్స్ వచ్చిన రాహుల్ గాంధీ వదులుకున్నారని.. కానీ వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుంది రాహుల్ గాంధీ దేశ ప్రధాని అవుతారని జోస్యం చెప్పారు. మోడీని ప్రధాని గద్దె మీద నుంచి కిందకు దించడం ఒక్క రాహుల్ గాంధీకే సాధ్యమన్నారు. మోడీని తరిమికొట్టి భారత రాజ్యాంగాన్ని రక్షిస్తామని పేర్కొన్నారు. మోడీని ఓడిస్తాం.. భారత రాజ్యాంగాన్ని కాపాడుకుంటామన్నారు. మాది ఎప్పటికీ ప్రజల పక్షమేనన్నారు. పాకిస్థాన్ ను ఇందిరా గాంధీ రెండు ముక్కలు చేశారు. తీవ్రవాదంపై పోరాటం చేసి దేశం కోసం ప్రాణత్యాగం చేసిన గొప్ప వ్యక్తులు ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ అని కొనియాడారు.



## లోక్‌సభ ఎన్నికల్లో

# భారీ రిగ్గింగ్

### బిజెపికి అనుకూలంగా ఎన్నికల సంఘం పనితీరు
### దాని ఆధారాలు తమవద్ద ఉన్నాయి
### తాము అధికారంలోకి వచ్చాక దేనినీ వదలం
### అధికారులు రిటైర్ అయినా పట్టుకుని శిక్షిస్తాం
### కాంగ్రెస్ న్యాయ సమీక్ష సదస్సులో రాహుల్

న్యూఢిల్లీ, ఆగస్టు 2 (నమస్తే ఉదయం)

మొన్నటిలోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని, దానికి సంబంధించిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన వార్షిక న్యాయ సదస్సులో పాల్గొని ఆయన మాట్లాడారు. భారత దేశంలో ఎన్నికల సంఘం న్యాయ సమ్మతంగా పనిచేయడం లేదని ఆయన ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికలను రిగ్గింగ్ చేయవద్దు అని, 2024 లోక్‌సభ ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని రాహుల్ తెలిపారు. ఆ రిగ్గింగ్‌కు చెందిన డేటా, డాక్యుమెంట్లు- తమ వద్ద ఉన్నాయన్నారు. దీన్ని మేం నిరూపిస్తామని, ఆ డేటా ఇప్పుడు ఉందని రాహుల్ పేర్కొన్నారు. ఓ లోక్‌సభ నియోజకవర్గానికి చెందిన అధ్యయనాన్ని ఆయన వెల్లడిరచారు. ఆ నియోజకవర్గంలో ఉన్న 6.5 లక్షల ఓటర్లలో 1.5 లక్షల ఓట్లు నకిలీ అని పేర్కొన్నారు. అలా ఫ్రాడ్ చేసి బీజేపీ అధికారంలోకి వచ్చిందని, 15 లేదా 20 సీట్లు తగ్గి ఉంటే, అప్పుడు మోదీ ప్రధాని అయ్యేవారు కాదని రాహుల్ అన్నారు. ఇండియాలో ఎన్నికల సంఘం చచ్చిపోయిందని విమర్శించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాజస్థాన్, మధ్యప్రదేశ్, గుజరాత్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఒక్క సీటు-గెలవలేదని, నాకు ఆశ్చర్యం వేసిందని, ఎప్పుడైనా ఎన్నికల అవకతవకల గురించి మాట్లాడితే ఆధారాలు అడుగుతున్నారని రాహుల్ అన్నారు. అయితే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల వేళ ఆ మార్పు కనిపించిందని, లోక్‌సభకు.. విధానసభకు ఎన్నికల జరిగిన సమయంలో కొత్తగా కోటి ఓటర్లు జత కలిశారని, దాంట్లో ఎక్కువ శాతం ఓట్లు బీజేపీకి వెళ్లాయని, అందుకే తన వద్ద ఆధారాలు ఉన్నట్లు చెబుతున్నాని రాహుల్ పేర్కొన్నారు.

## మంత్రి కొండా సురేఖకు

# నాంపల్లి కోర్టు షాక్



## క్రిమినల్ కేసుకు కోర్టు ఆదేశం

హైదరాబాద్, ఆగస్టు 1

మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు బిగ్ షాకిచ్చింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరువు నష్టం దావాపై న్యాయస్థానం విచారణ జరిపింది. మంత్రిపై కేసు నమోదు చేయాలని పోలీసులను ఆదేశించింది. నాంపల్లి కోర్టు ఆదేశించింది. గతంలో ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడిన మంత్రి.. సమంత విడాకులపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. విడాకుల అంశంలో మాజీ మంత్రి కేటీఆర్‌పై సంచలన ఆరోపణలు చేశారు. దీంతో ఆయన పరువు నష్టం దావా వేశారు. దీనిపై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఈ నెల 21లోపు క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోలీసులను

..మిగతా 2లో



## కేసీఆర్ దోషి అని

# కాళేశ్వరం కమిషన్ చెప్పింది

### కాంగ్రెస్ పార్టీ గొప్పతనం గ్రూపులే
### మహేశ్ కుమార్ గౌడ్

హైదరాబాద్, ఆగస్టు 1 (నమస్తే ఉదయం)

పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్ దోషి అని కాళేశ్వరం కమిషన్ చెప్పిందన్నారు. ప్రాజెక్ట్ పేరుతో లక్షల కోట్ల రూపాయలు వృధా చేసి అప్పుల పాలు చేశారని కమిషన్ తేల్చి చెప్పిందన్నారు. ఇంజనీర్లు చెప్పింది కేసీఆర్ వినకుండా తన సొంత లాభం మాత్రమే చూసుకున్నారని ఆరోపించారు. తనకి ఇష్టం ఉన్న చోట ప్రాజెక్ట్ కట్టాలని కేసీఆర్ ఆదేశాలు ఇచ్చారని మహేశ్ గౌడ్ తెలిపారు.

"రెండే పిల్లర్లు కుంగాయని అంటున్నారు. ఇది సామాన్య విషయమా..? ఈ కార్ రేస్ లో కేటీఆర్ అవినీతికి పాల్పడలేదా..? ప్రభుత్వ సొమ్ము

..మిగతా 2లో

# మోడీ స్వదేశీ వస్తు నినాదం

### ఇతర దేశాలపై ఆధారపకుండా సాగాలి
### ట్రంప్ టారిఫ్‌ల నేపథ్యంలో సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ, ఆగస్టు 2 (నమస్తే ఉదయం)



భారత్ కూడా అతి త్వరలోనే మూడో అతిపెద్ద ఆర్థిక శక్తిగా మారనుందని ప్రధాని మోడీ మరోమారు ఉద్ఘాటించారు. అందువల్ల ఇప్పుడు మన ఆర్థిక ప్రయోజనాలపై మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదిగే దిశగా భారత్ పరుగులు పెడుతోందని మోదీ తెలిపారు. అంతేకాదు.. ట్రంప్ టారిఫ్‌ల వేళ స్వదేశీ ఉత్పత్తులను పెంచాలంటూ పిలుపునిచ్చారు. భారత్ ఆర్థిక వ్యవస్థను ఉద్దేశిస్తూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. 'డెడ్ ఎకానమీ' అంటూ ఆయన చేసిన విమర్శలపై భారత ప్రధాని నరేంద్రమోదీ పరోక్షంగా స్పందించారు. ఉత్తరప్రదేశ్ పర్యటనలో ఉన్న ప్రధాని మోదీ వారణాసిలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అనిశ్చితిన నెలకొంది. అన్ని దేశాలు తమ తమ సొంత ప్రయోజనాలపైనే ఎక్కువగా దృష్టిపెడుతున్నాయి. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోంది. రాజకీయ పార్టీలు కూడా విభేదాలను పక్కనబెట్టి 'స్వదేశీ' ఉత్పత్తుల విప్లవానికి నడుంకట్టాలి. కేవలం భారతీయులు తయారుచేసిన వస్తువులను మాత్రమే కొనుగోలు చేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఇటీవల భారత్-రష్యా బంధంపై ట్రంప్ స్పందిస్తూ.. ఇద్దరూ వారి మృత ఆర్థిక వ్యవస్థలను దిగజార్చు కోనీయండని, కలిసి మునగనీయండని విమర్శలు గుప్పించిన సంగతి తెలిసిందే. అంతకుముందు న్యూదిల్లీపై 25శాతం సుంకాలు విధించిన అగ్రరాజ్యాధినేత.. రష్యా నుంచి చమురును కొనుగోలు చేస్తే అదనంగా పెనాల్టీలు ఉంటాయని హెచ్చరించారు. ఈ నేపథ్యంలోనే మోదీ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

# ఘనంగా ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం


విద్యార్థినికి బంగారు పథకం అందచేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ


వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవ ప్రసంగం చేస్తున్న భారత వ్యవసాయ పరిశోధన మండలి డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్


వ్యవసాయ విశ్వవిద్యాలయం గురించి వివరిస్తున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య

రాజేంద్రనగర్, ఆగస్టు 2(నమస్తే ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ స్నాతకోత్సవం ఈరోజు రాజేంద్రనగర్ లోని విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఘనంగా జరిగింది. 2021- 2022 మధ్య ఉత్తీర్ణులైన 844 మంది యూజీ , పీజీ, పీహెచ్ డీ విద్యార్థులకి విశ్వవిద్యాలయ కులపతి, రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అధ్యక్షతన జరిగిన స్నాతకోత్సవంలో పట్టాలు ప్రధానం చేశారు. తొలుత వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య వార్షిక నివేదికను సమర్పించారు. విశ్వవిద్యాలయం వివిధ పంటల్లో విడుదల చేసిన వంగడాలు జాతీయస్థాయిలో ఆదరణ పొందుతున్నాయని అల్దాస్ జానయ్య తెలిపారు. బోధన, పరిశోధన, విస్తరణల్లో విశ్వవిద్యాలయం బహుముఖ ప్రతిభ కనబరుస్తుందన్నారు. దేశ, విదేశాలకు చెందిన అనేక ప్రముఖ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామని జానయ్య తెలిపారు. అగ్రి హబ్, ఇతర ల్యాబ్ ల్ని విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేశామని తెలిపారు. భారత వ్యవసాయ పరిశోధన మండలి, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ల తోడ్పాటుతో విశ్వవిద్యాలయాన్ని అత్యున్నత స్థాయికి తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నామని జానయ్య వివరించారు. ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ఐ సీ ఏ ఆర్) డైరెక్టర్ జనరల్, డిపార్ట్మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ (డేర్) కార్యదర్శి డాక్టర్ మంగీలాల్ జాట్ స్నాతకోత్సవ ప్రసంగం చేశారు. ఈ విశ్వవిద్యాలయంలో చదివిన ఎందరో వ్యక్తులు నేడు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అత్యుత్తమ స్థానాల్లో ఉండి దేశానికి, రైతాంగానికి సేవలు అందిస్తున్నారన్నారు. ఒకనాడు ఆహార కొరత ఎదుర్కొన్న దేశం నేడు ఆహార ధాన్యాల మిగులు స్థాయికి చేరుకుందని జాట్ అన్నారు. దీనికి శాస్త్ర విజ్ఞానం, ప్రభుత్వాల విధానాలు, రైతుల నిరంతర శ్రమలే దోహదం చేశాయన్నారు. నేడు తెలంగాణ, ఇతర రాష్ట్రాల కారణంగా దేశం వరి ఉత్పత్తిలో ప్రథమ స్థానంలో నిల్చిందన్నారు. భూగర్భజలాల క్షీణత, భూసార క్షీణత, పర్యావరణ విధ్వంసం, పర్యావరణ మార్పులు వంటి సవాళ్లను నేడు మనం ఎదుర్కొంటున్నామని జాట్ అన్నారు. ఈ సవాళ్లను సమర్థంగా ఎదుర్కొని 2047 నాటికి "వికసిత్ భారత్" గా రూపాంతరం చెందటానికి అందరూ కృషి చేయాలన్నారు. స్థానిక పంటలను, తృణధాన్యాల పంటలను విరివిగా ప్రోత్సహించాలన్నారు. కొత్త కొత్త అంశాల్లో పరిశోధనలు చేపట్టాలని వ్యవసాయ రంగంలో డేటాని సమర్థంగా వినియోగించుకోవాలని, సహజ సేంద్రియ వ్యవసాయ, అంతర పంటల సాగులపై దృష్టి పెట్టాలని జాట్ సూచించారు. నూతన నైపుణ్యాల్ని ఉపయోగించుకోవాలని పరిశోధనల్ని రైతుల ముంగిటకు సాధ్యమైనంత త్వరగా తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. వ్యవసాయ విశ్వవిద్యాలయాల్లో అధునాతన నైపుణ్యాలు, బోధనలకి పెద్దపీట వేయాలని, మానవ వనరుల యాజమాన్యాన్ని సమర్థవంతంగా చేపట్టాలని జాట్ అభిప్రాయపడ్డారు. అదేవిధంగా సంస్థల్లో అవసరమైన సంస్కరణలు చేపట్టి సంస్థలన్ని పూర్తి సమన్వయంతో పనిచేయాలన్నారు. వ్యవసాయ పరిశోధనల్లో పెట్టుబడులు మరింత పెరగాల్సిన అవసరం ఉందని జాట్ అభిప్రాయపడ్డారు. 1965లో నాటి ప్రధానమంత్రి లాల్ బహుదూర్ శాస్త్రి జాతికి అంకితం చేసిన ఈ వ్యవసాయ విశ్వవిద్యాలయం బహుముఖాలుగా విస్తరించడం చాలా గర్వకారణమని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ అభినందించారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సవాళ్లకు దీటుగా పనిచేస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయం తన ప్రయాణాన్ని సాగిస్తుందన్నారు. దేశంలోనే తొలిసారిగా ఈ మధ్యనే వ్యవసాయ విశ్వవిద్యాలయం, సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. అదేవిధంగా స్మార్ట్, డిజిటల్ వ్యవసాయాల పరిశోధనలకు పెద్దపీట వేస్తూ ఎస్ బీ ఐ ఫౌండేషన్ సహకారంతో అరిసా ల్యాబ్ ని వ్యవసాయ విశ్వవిద్యాలయం లో ఏర్పాటు చేస్తుందన్నారు. భవిష్యత్తులో విశ్వవిద్యాలయం దేశంలో తొలి పది స్థానాల్లో నిలవనుందని గవర్నర్ ఆశాభావం వ్యక్తం చేశారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం ఈ మధ్య నిర్వహించిన 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం, 'ప్రతి గ్రామానికి నాణ్యమైన విత్తనాలు' కార్యక్రమాల వల్ల రైతాంగానికి చాలా మేలు జరిగిందని వివరించారు. వాతావరణమార్పులు, మార్కెటింగ్ తదితర సవాళ్లకు అనుగుణంగా శాస్త్రవేత్తలు కొత్త పరిష్కారాలు చూపించాలన్నారు. యువతకి, మహిళలకి ఉపాధి కల్పించడంతోపాటు పేదరికం రూపుమాపి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడంలో వ్యవసాయానిది ప్రధాన పాత్ర అని.. యువ పట్టభద్రులు రైతులకు నిరంతర సేవలందిస్తూ వారి సాగుని లాభసాటిగా చేసేందుకు కృషి చేయాలని గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి జిష్ణుదేవ్ వర్మ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పేజీ , పీహెచ్ డీ విద్యార్థులకు పట్టాలు ప్రధానం చేశారు. అదేవిధంగా అత్యుత్తమ ప్రతిభగల కనపరిచిన 20 మంది విద్యార్థులకు 30 బంగారు పతకాలు అందజేశారు. కంది అగ్రికల్చర్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన జి .భార్గవి బీ టెక్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ లో అత్యధిక ఓ జీ పీ ఏ సాధించినందుకు 6 బంగారు పతకాలు, వరంగల్ వ్యవసాయ కళాశాలకు చెందిన అర్షియా తబస్యుమ్ బీ ఎస్సీ (ఆనర్స్), అగ్రికల్చర్ లో అత్యధిక ఓ జీ పీ ఏ సాధించినందుకు నాలుగు బంగారు పతకాలు పొందింది. ఈ స్నాతకోత్సవంలో రిజిస్ట్రార్ డాక్టర్ జీ ఈ సీ హెచ్ విద్యాసాగర్, విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు, విశ్వవిద్యాలయ అధికారులు, పూర్వ ఉపకులపతులు, రిజిస్ట్రార్ లు, ఐ సీ ఏ ఆర్ సంస్థల ప్రతినిధులు,అధికారులు వివిధ బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


తల్లిదండ్రులతో ఆరు బంగారు పతకాలు సాధించిన జి భార్గవి


నాలుగు బంగారు పతకాలు సాధించిన అర్షియా తబస్సుమ్



## అల్ ఇండియా క్లాసికల్ డాన్స్ పోటిల్లో ద్వితీయ స్థానంలో ప్రదీక్ష

### శాలువాతో సన్మానించిన కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

కూకట్‌పల్లి, ఆగస్టు 2 (నమస్తే ఉదయం) శేరిలింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని రాజీవ్ గాంధీ నగర్ కాలనీ లో నివాసముండే వినోద్, వరలక్ష్మి దంపతుల కుమార్తె ప్రదీక్ష కేరళ రాష్ట్రంలో జరిగిన అల్ ఇండియా క్లాసికల్ డాన్స్ పోటిల్లో ధ్వితీయ స్థానంలో నిలిచిన సందర్భంగా డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ చిన్నారిని శాలువతో సన్మానించి అభినందించారు. మానసా స్కూల్ ఆఫ్ డాన్స్ అకాడమీ ప్రణవి మేడం సహకారంతో చిన్నారి ప్రదీక్ష ఈ ఘనత సాధించడం జరిగిందని తల్లితండ్రులు తెలియచేసారు. కార్యక్రమంలో జగదీష్, మోజెస్, సత్యనారాయణ, లింగం, అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.




## రాష్ట్ర క్రీడల అభివృద్ధికి మార్గదర్శకంగా స్పోర్ట్స్ కాంక్లేవ్: మంత్రి డా. వాకిటి శ్రీహరి

మక్తల్, ఆగస్టు,02(నమస్తే ఉదయం):తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్‌కి గ్రాండ్ ప్రారంభోత్సవం మంత్రి శ్రీహరి ఆధ్వర్యంలో వేడుకలు హెచ్ఐసీసీలో తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ ఫస్ట్ ఎడిషన్ ఘనంగా ప్రారంభంతెలంగాణ రాష్ట్ర క్రీడల శాఖ ఆధ్వర్యంలో హెచ్ఐసీసీ, హైదరాబాద్ వేదికగా నిర్వహించిన ఫస్ట్ ఎడిషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ కాంక్లేవ్ కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి వర్యులు డా. వాకిటి శ్రీహరి నేడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి ,రాష్ట్ర క్రీడా సలహాదారు జితేందర్ రెడ్డి ,ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజాన్,సాట్ ఎండి %డ% వైస్ చైర్మన్ సోనీ బాల,జాతీయ అంతర్జాతీయ స్థాయి క్రీడా ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

# తహశీల్దార్ కార్యాలయంలో వసూల్ రాజాలు!

## కార్యాలయంలోనే తిష్ట వేస్తూ దందాకు పాల్పడుతున్న ఓ మాజీ ఆలయ డైరెక్టర్!




గద్వాల ప్రతినిధి,ఆగస్టు 2 (నమస్తే ఉదయం )జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నిత్యం అత్యంత రద్దీగా ఉండే ప్రభుత్వ కార్యాలయం ఏదైనా ఉందంటే అది గద్వాల తహసీల్దార్ కార్యాలయమే అని చెప్పుకోవాలి. జిల్లాల విభజన, కొత్త జిల్లాలు, మండలాల ఏర్పాటు క్రమంలో జిల్లా కేంద్రానికి నడిబొడ్డున కొనసాగుతున్న ఈ తహశీల్దార్ కార్యాలయంలో దళారులు రాజ్యమేలుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా రెవెన్యూ కార్యాలయానికి ఏదైనా పనిపై వెళ్లాలంటే ఉద్యోగులు ఎన్ని కొర్రీలు పెడతారోనని అంతా ఆందోళన చెందుతారు. కానీ ఇక్కడ మాత్రం దళారుల తీరుతో వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

### తహశీల్దార్ స్నేహితుడు కావడంతో

కార్యాలయానికి వచ్చిన వారితో తహశీల్దార్ నా స్నేహితుడు అంటూ జములమ్మ ఆలయ కమిటి ఓ మాజీ డైరెక్టర్ కార్యాలయంలో తిష్ట వేసి నా ద్వారా పనులు అవుతాయని హల్చల్ చేస్తున్నాడని వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చే ప్రజలు ఆరోపిస్తున్నారు. జిల్లా కేంద్రం కావడంతో భూముల ధరలు కోట్లలో ఉండడంతో రియల్ ఎస్టేట్ వెంచర్లు, భూముల కొనుగోలు అమ్మకాలు,లిటిగేషన్ భూముల వ్యవహారాలలో పనులు చేయిస్తానని ప్రజల నుంచి డబ్బులు దండుకుంటున్నారనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. సామాన్యులు తమ పనుల కోసం రాజకీయ నాయకులని సంప్రదించినా ఈ దళారుడి మాటకు ఆఫీసు సిబ్బంది అన్ని పక్కన పెట్టి పని చేయాల్సిందే. దీంతో బాధ్యతగా విధులు నిర్వహిస్తున్నా ఇలాంటి వారితో కొందరు అధికారులు ఇబ్బందులు పడుతున్నారని తెలుస్తోంది. గద్వాల తహశీల్దార్ కు ఆ మాజీ ఆలయ డైరెక్టర్ కు స్నేహబంధం ఉంది. ఈ చనువుతో నిత్యం తహశీల్దార్ కార్యాలయంలో ఉంటూ కార్యాలయ పెద్దకు ప్రజలకు మధ్య చలామణి అవుతున్న ఆ ఆలయ కమిటి మాజీ డైరెక్టర్ కు డబ్బులు ఇస్తే తహశీల్దార్ కార్యాలయంలో ఎలాంటి పనైనా నిమిషాల్లో అయిపోతుందని కార్యాలయానికి పనుల నిమిత్తం వచ్చే ప్రజలు చర్చించుకుంటున్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి తరచుగా వస్తుంటారు. ప్రభుత్వ కార్యక్రమాల పేరుతో కొందరు అధికారులు సిబ్బంది అందుబాటు లేకపోయినా కార్యాలయ ఆవరణలో పడిగాపులు కాస్తుంటారు. ఇటీవల రేషన్ కార్డులో పేర్ల నమోదు, మార్పులు చేస్తున్న విషయంలో సర్వర్ పని చేయకపోవడంతో కాలు అరిగేలా తిరిగిన ప్రయోజనం లేక దళారుల వైపు చూడడంతో వారికి డిమాండ్ పెరిగింది. కార్యాలయం వెలుపల వివిధ దరఖాస్తులను నింపే దళారులు సైతం మేము మొత్తం పని చేయిస్తామని పనిని బట్టి రేటును నిర్ణయిస్తూ వినియోగదారుల జేబును ఖాళీ చేస్తున్నారు.తహశీల్దార్ సైతం తమ కులం వారికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణ ఉంది. ప్రభుత్వ పథకాల అమలులో బిజీగా ఉండడంతో ఒక పని కోసం తరచుగా రావాల్సి వస్తుందని భావనతో విసుగెత్తి ఇలాంటి దళారులకు పనిని బట్టి ముట్టజెప్పి పని అయ్యేలా చూసుకుంటున్నారు. సాయంత్రం అయిందంటే చాలు మరో నలుగురు దళారులు కార్యాలయంలో వాలిపోయి తమ వారి పనులను చక్కదిద్దుకుంటున్నారు.

### పర్యవేక్షణ లేకపోవడంతో...

ప్రభుత్వం ప్రవేశపెట్టే వివిధ పథకాలను మండల స్థాయి అధికారులు గ్రామాలలో అమలు చేస్తుంటారు. ఇందిరమ్మ ఇల్లు, కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్,రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, భూ భారతి దరఖాస్తులు పరిష్కారం, భూమి కొనుగోలు అమ్మకాలు విషయంలో స్లాట్ బుకింగ్ ద్వారా మండల తహశీల్దార్ కార్యాలయంలో నిత్యం కార్యకలాపాలు కొనసాగుతుంటాయి. అంతేగాక విద్యార్థులకు అవసరమైన కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలతో పాటు అనేక ఇతర సేవలను ఈ కార్యాలయం ద్వారానే ప్రజలు పొందాల్సి ఉంటుంది. వీటిని పరిష్కరించాల్సిన సంబంధిత అధికారులు.. ప్రజలు ఇచ్చే దరఖాస్తులను వివిధ కారణాలతో కొర్రీలు పెడుతూ సమయం వృధా చేస్తున్నారని విసుగు చెంది దళారులను ఆశ్రయిస్తున్నారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకొని మరో నలుగురు దళారులు కార్యాలయంలో అక్రమ వసూళ్లకు పాల్పడుతూ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారని చర్చించుకుంటున్నారు. ప్రజలకు పాలన మరింత చేరువ చేయాలనే ఉద్దేశంతో జిల్లా కేంద్రంలో సమీకృత జిల్లా కార్యాల సముదాయంలో కలెక్టర్, కార్యాలయం పక్కనే ఆర్డిఓ ఉన్నా ఉమ్మడి జిల్లా నాటి పాలన పరిస్థితులే ఉన్నాయని ఆరోపిస్తున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు తరచుగా కార్యాలయాలు తనిఖీ చేసి ప్రజల సమస్యలను తెలుసుకోని అలసత్వ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### అలాంటి ఏవి లేవు

ఈ విషయమై తహశీల్దార్ మల్లికార్జున్ ను వివరణ కోరగా ఈ విషయం నా దృష్టికి రాలేదని, కార్యాలయంలో వ్యవహారాల సక్రమంగానే నడుస్తున్నాయని, కావాలనే కొందరు పనులు గాక అసంతృప్తితో మాపై ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు.

## కేసీఆర్ దోషి అని కాళేశ్వరం కమిషన్ చెప్పింది

మొదటి పేజీ తరువాయి...

తిన్న వాళ్ళు కక్కక తప్పదు. ఇతర ఎమ్మెల్యేలను పార్టీలోకి తీసుకున్న నియోజకవర్గాల్లో ఇబ్బందులు ఉన్నాయి. ప్రతిపక్షాలు చేసిన కుట్రలతోనే ఇలా చేయాల్సి వచ్చింది. కాంగ్రెస్ పార్టీలో గ్రూపులు సహజం. పార్టీలో గ్రూపులు ఉండాలి. కాంగ్రెస్ పార్టీలో గొప్పతనం ఏంటంటే గ్రూపులే.ఎన్ని గ్రూపులు ఉన్నా ఎన్నికలు వచ్చేసరికి అందరూ ఒక్కటై పార్టీ కోసం పోరాడాలి. గ్రూపుల వల్ల పార్టీకి నష్టం జరగకుండా చూసుకునే బాధ్యత మాది. పార్టీలో పాత నీరుతో పాటు కొత్త నీరు కూడా ఉండాలి. పాత కొత్త కలయికలతో పార్టీ దృఢంగా ఉంటుంది. సుతి లేని సంసారం చేసి 8 లక్షల కోట్లు అప్పు చేశారు. కేసీఆర్ కుటుంబం అంటే అబద్దాల పుట్ట. మీ చేతకానితనం వల్ల బనకచర్ల ప్రాజెక్ట్ వస్తోంది. మేము మేల్కొని ఫిర్యాదు చేస్తే ప్రాజెక్ట్ పనులు ఆగాయి" అని మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు.

## మంత్రి కొండా సురేఖకు నాంపల్లి కోర్టు షాక్

మొదటి పేజీ తరువాయి...



ఆదేశించింది. కేటీఆర్ దాఖలు చేసిన పరువు నష్టం దావాను బీఎన్ఎస్ 356 కింద కోర్టు పరిగణలోకి తీసుకుంది. ఇదే సమయంలో మంత్రి తరపు న్యాయవాది అభ్యంతరాలను న్యాయస్థానం తోసిపుచ్చింది. కేటీఆర్‌పై కొండా సురేఖ చేసిన ఆరోపణలు నిరాధారంగా ఉన్నాయని.. కేసు నమోదుకు ఆదేశాలివ్వాలన్న కేటీఆర్ తరపు న్యాయవాది వాదనలతో కోర్టు ఏకీభవించింది. ఈ నెల 21లోపు క్రిమినల్ కేసు నమోదు చేయాలని ఆదేశించింది. మరోవైపు ఈ అంశంపై మంత్రి కొండా సురేఖ స్పందించారు. కేసు నమోదుపై తనకు ఎలాంటి సమాచారం లేదన్నారు. కోర్టు నుంచి నోటీసు వచ్చిన తర్వాత దీనిపై స్పందిస్తానని చెప్పారు.

# వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అమ్మాయిలదే హవా

## స్నాతకోత్సవంలో బంగారు పతకాలతో పాటు డిగ్రీలు పొందిన వారిలో బాలికలే టాప్


డిగ్రీలు పొందిన అమ్మాయిలు


రెండు బంగారు పతకాలతో ఎస్ వర్షిణి


స్నాతకోత్సవంలో....

బుద్వేల్, ఆగస్టు 2 (నమస్తే ఉదయం): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో శనివారం జరిగిన 55వ వార్షిక స్నాతకోత్సవంలో అమ్మాయిల హవా కనిపిం చింది. స్నాతకోత్సవంలో డిగ్రీలు పొందిన వారిలో 80 శాతం మంది బాలికలే కనిపించారు. బం గారు పతకాలు సాదించిన 20 మంది విద్యార్థులలో 15 మందికి పైగా అమ్మాయిలే ఉండటం గమనార్హం. విశ్వవిద్యాలయంలో చదువుతున్న వారిలో కూడా 75 నుంచి 80శాతం మంది బాలికలు ఉండటంతో అమ్మాయిల హవా కొట్టొచ్చినట్లు కనిపించింది. వ్యవసాయ విశ్వవిద్యాలయ 0లో అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఆరు బంగారు పతకాలు సాధించిన జి.భార్గవితో పాటు, బీఎస్సీ అగ్రికల్చర్ చదివి నాలుగు బంగారు పతకాలు సాధించిన అర్షియ తబస్సుమ్ తో పాటు రెండు బంగారు పతకాలు సాదించిన వర్షిణి, ఒక బంగారు పతకం సాధించిన కె. చందన లు బాలికలే కావడం సంతోషకరం.

**ఐఏఎస్ సాదించడమే తన ఆశయం అర్షియ తబస్సుమ్**

వరంగల్ లో బీఎస్సీ (హానర్స్) అగ్రికల్చర్ పూర్తి చేసి నాలుగు బంగారు పతకాలు సాదించిన అర్షియ తబస్సుమ్ ప్రస్తుతం మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ గా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో ఐఏఎస్ సాదించాలన్నది తన కోరిక అని ఆమె వివరించింది. వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీటెక్ అగ్రికల్చర్ పూర్తి చేసి బంగారు పతకం సాదించిన కె. చందన ప్రస్తుతం నర్సంపేట్ లోని నెక్కొంద ప్రాంతంలో అసిస్టెంట్ ఎక్స్ క్యూటీవ్ ఇంజనీర్ గా పనిచేసు న్నానని తెలిపింది.

**ఉద్యోగం కోసం ప్రయత్నిస్తున్నాను: జి.భార్గవి**

వ్యవసాయ విశ్వవిద్యాలయం లో అగ్రి కల్చరల్ ఇంజనీరింగ్ పూర్తి చేసి ఆరు బంగారు పతకాలు సాదించిన వనపర్తి కి చెందిన జి.భార్గవి ప్రస్తుతం ప్రైవేటు విద్యా సంస్థలో లెక్చరర్ గా పనిచేస్తున్నారు. భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగం సాదించాలని ప్రయత్నాలలో ఉన్నట్లు తెలి పారు.


ఐ సీ ఏ ఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్ కు వినతి పత్రం అందచేసి వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య తో కలిసి జ్ఞాపికను బహుకరిస్తున్న టాసా ప్రతినిధులు

## వ్యవసాయ విశ్వవిద్యాలయం అద్యాపకులకు రావాల్సిన బకాయిలను విడుదల చేయాలి

బుద్వేల్, ఆగస్టు 2 (నమస్తే ఉదయం): విశ్వవిద్యాలయ అధ్యాపకులకు 2016 నుంచి రావాల్సిన యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ బకాయిలను త్వరితగతిన విడుదల చేయాలని తెలంగాణ వ్యవసాయియ శాస్త్రవేత్తల సంఘం (టాసా) అధ్వర్యంలో శనివారం భారత వ్యవసాయ పరిశోధన మండలి (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్ ను కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన కు వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఆల్దాస్ జానయ్య తో కలిసి జ్ఞాపికను బహుకరించారు. ఈ సందర్భంగా టాసా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ కె పవన్ చం ద్రారెడ్డి, డాక్టర్ సల్లా సౌజన్య లు మాట్లాడుతూ, వ్యవసాయ విశ్వవిద్యాలయం అద్యాపకులకు రావాల్సిన 17. 13 కోట్ల బకాయిలు 2016 నుంచి విడుదల కాకపోవడం బాధాకరమన్నారు. ఈ బకాయిలు విడుదల చేస్తే అద్యాపకులకు, పదవీ విరమణ పొందిన వారికి మేలు కలుగుతుందన్నారు. టాసా ప్రతినిధుల విన్నపానికి స్పందించిన ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీలాల్ జాట్ త్వరలోనే వ్యవసాయ విశ్వవిద్యాలయం అధ్యాపకులకు 2016 నుంచి రావాల్సిన బకాయిలను విడుదల చేసేలా చూస్తానన్నారు. ఐసీఏఆర్ డీజీ ని కలసిన వారిలో టాసా ఉపాధ్యక్షులు డాక్టర్ జె కమలాకర్, సంయుక్త కార్యదర్శి డాక్టర్ పి.రమేశ్, కోశాధికారి డాక్టర్ ప్రశాంత్ లు ఉన్నారు.

## నేడు గణేష్ ఉత్సవాలపై భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సమావేశం



రాజేంద్రనగర్, ఆగస్టు 2 (నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ అసెంబ్లీ ఆధ్వర్యంలో రేపు ఉదయం 10 గంటలకు బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ లోనిబండ్లగూడ శారదామము శ్రీ సరస్వతీ శిశు మందిర్ లో జరుగును. ఈ సమావేశానికి ప్రతి డివిజన్ ప్రతి మండలం నుండి ఒక కన్వీనర్ నలుగురు జాయింట్ కన్వీనర్లను తీసుకొని హాజరు కావాలని ఆయన కోరారు. ఈ సమావేశానికి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ఉపాధ్యక్షులు వైకుంఠం , భాగ్యనగర్ గణేశ సమితి కార్యవర్గ సభ్యులు రూపు రాజు విచ్చేసి సూచనలు, సలహాలు ఇవ్వనున్నారని రాజేంద్ర అసెంబ్లీ గణేష్ సభ్యులు అందరు కూడ సమయానికి వచ్చి సమావేశాన్ని విజయవంతం చేయవలసిందిగా కోరాలు.


జిల్లా మహా సభలలో మాట్లాడుతున్న ఎస్ రామ్మోహన్

## భవన నిర్మాణ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శిగా సుంకర రామ్మోహన్ రెండవ సారి నియామకం

బుద్వేల్, ఆగస్టు 2 (నమస్తే ఉదయం): రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు మండలంలో శనివారం రంగారెడ్డి జిల్లా బిల్డింగ్ అండ్ అదర్ కన్ స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ నాలుగో మహాసభలు జరిగాయి. ఈ సభలలో బుద్వేల్ శ్రీ శివ సాయి కాలనికి చెందిన సుంకర రామ్మోహన్ రెండవసారి జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైనారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గంగారెడ్డి జిల్లాలో భవన నిర్మాణ , ఇతర నిర్మాణ రంగాల కార్మికుల సమస్యల సాధన కోసం నిరంతరం పోరాడుతానన్నారు.



## రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలి

**టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్**

కూకట్‌పల్లి, ఆగస్టు 2 (నమస్తే ఉదయం) తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కార్యకర్తలు సమర్థవంతంగా పని చేయాలని పార్టీ వాణిని ప్రజల్లో బలంగా వినిపించాలని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి బండి రమేష్ పేర్కొన్నారు. శనివారం ఆయన నియోజకవర్గానికి చెందిన సోషల్ మీడియా కార్యకర్తలతో కూకట్ పల్లి నియోజకవర్గ శ్రీహేమదుర్గా భవన్ లో గల కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ చేపట్టిన ప్రతి కార్యక్రమం సోషల్ మీడియా ద్వారానే ఎక్కువగా ప్రజలకు చేరుతుందని అలాంటి మీడియాను ఒక ఆయుధంలా ఉపయోగించి పార్టీ వాయిస్ ను ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలపై అయన కమిటీ సభ్యులు నుండి సలహాలు, సూచనలు తీసుకున్నారు. త్వరలోనే నియోజకవర్గానికి సంబంధించి కొత్త కమిటీని నియమిస్తామన్నారు.


కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను అమలు చేయాలని ఇందిరా పార్కు ధర్నా చౌక్ వద్ద బీజేపీ నిర్వహించిన మహా ధర్నాలో పాల్గొన్న బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనితా దామోదర్ రెడ్డి

## కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి

### మేకల వనితా దామోదర్ రెడ్డి

బుద్వేల్, ఆగస్టు 2 (నమస్తే ఉదయం) : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో ఇచ్చిన బీసీ డిక్లరేషన్ హామీని అమలు చేయాలని కోరుతూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన మహాధర్నాలో రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి పెద్ద సంఖ్యలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మేకల వనిత దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు న్యాయం చేయాలన్నారు. బీసీ రిజర్వేషన్లను బీసీలకే ఇవ్వాలని కోరారు.

**పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్న మేకల వనితా దామోదర్ రెడ్డి :**

బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా కార్యదర్శిగా ఉన్న మేకల వనిత దామోదర్ రెడ్డి పార్టీ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటున్నారు. మొక్కలు నాటే కార్యక్రమం తో పాటు పార్టీ సభ్యత్వ నమోదు లో ఆమె చురుకుగా పాల్గొన్నారు. బీజేపీ చేపడుతున్న ప్రతి కార్యక్రమానికి హాజరై పార్టీ పట్ల ఉన్న తన ప్రేమను చాటుకుంటున్నారు.



## ట్రాఫిక్ నిబంధనలను పాటించని వాహనదారులపై కేసు నమోదు

రాజేంద్రనగర్, ఆగస్టు2(నమస్తే ఉదయం) రాజేంద్రనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిది ప్రాంతములో ట్రాఫిక్ నియమాలను ఉల్లంఘించి,మద్యంసేవించిన ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. వాహనలు నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనలు నడిపిన, డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయబడిన తరువాత కూడ వాహనలు నడిపిన వారికి వాహనాలు ఇచ్చిన వాహనదారుల పై రాజేంద్రనగర్, నార్సింగి, రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్ ఇన్స్పెక్టర్లు శనివారం 10 మంది పై చార్జ్ షీట్ నమోదు చేసి వ్యక్తులను 8మీ స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టు, మెజిస్ట్రేట్ రాజేంద్ర నగర్ కోర్ట్ నందు హాజరు పరిచడం జరిగింది. ఈ చార్జ్ షీట్ లను పరిశీలించిన తరువాత మూడవ స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టు%×××% మేజిస్ట్రేట్ కోర్ట్ లో హాజరు పరిచిన 66 ప్రతివాదులలో 10 మంది ప్రతివాదులకి జైలు శిక్ష విదించడం జరిగింది అందులో 3 రోజుల చొప్పున జైలు శిక్ష విదించడం జరిగినది, అదే విదంగా మిగిలిన ప్రతివాదులకు జరిమానా విదిస్తూ, మళ్ళి అటువంటి ఉల్లంఘనలు చేస్తే సెక్షన్ 182 మోటార్ వాహన చట్టం ప్రకారం మూడు నెలల జైలు శిక్ష తో పాటు 10,000/- రూపాయల జరిమానా విదించడం జరుగుతుంది అని హెచ్చరించడం జరిగింది. రాజేంద్రనగర్, నార్సింగి, రాయదుర్గం, శంషాబాద్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ల పరిది ప్రాంతములో గల ప్రజలు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబందనలను పాటిస్తూ ట్రాఫిక్ పోలీస్ వారికి సహకరించాలని కోరారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2(నమస్తే ఉదయం) ధరూర్ మండలో జాతీయ రహదారిపై రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్నగా ఓ మహిళ మృతి చెందింది. ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం ధరూర్ మండలం జాంపల్లి శివారులో గల జాతీయ రహదారి పై చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రాయచూరుకు చెందిన గోవింద్ రెడ్డి తన భార్య సరోజ(52)తో కలిసి రాయచూరు నుంచి బైక్ పై ధరూర్ కు వెళ్లుతున్నారు. జాంపల్లి గ్రామ శివారులోగల ప్రధాన రహదారి రోడ్డు సరిగా లేకపోవడంతో బైక్ కంట్రోల్ కాలేదు. దీంతో ముందుగా వెళ్లుతున్న మరో ద్విచక్ర ఢీకొట్టింది. ఈ ఘటనలో సరోజమ్మ తీవ్రంగా గాయపడగా చికిత్స కోసం గద్వాల ఆసుపత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమద్యలో మృతి చెందిందని కుటుంబ సభ్యులు తెలిపారు. అదే విధంగా గోవింద్‌రెడ్డి తో పాటు మరో వాహనదారుడు రంగారెడ్డిలకు స్వల్పగాయాలయ్యాయి. జాంపల్లి శివారులో గల ప్రధాన రహాదరిపై ఏర్పడిన గుంతను మట్టితో



కప్పివేయడంతో వేగంగా వెళ్తున్న వాహనాలు సడెన్ గా స్లో చేయడంతో వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయని స్థానికులు తెలిపారు. గతంలో ఇదే స్థలంలో అనేక రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. గుంతలమయంగా మారిన రహదారిని తాత్కాలికంగా మరమ్మతులు చేసి చేతులు దులుపుకుంటున్నారే కాని, శాశ్వతంగా రోడ్డు మరమ్మతులు నోచుకోలేదని అధికారులపై వాహనదారులు మండిపడుతున్నారు.

## కేజీబీవీని అకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా సెక్టో రల్ అధికారి

గట్టు,ఆగస్టు 2(నమస్తే ఉదయం)గట్టు మండల కేంద్రంలోని లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని శనివారం జిల్లా సెక్టో రల్ అధికారి హంపయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి గదులు, వంటగది, త్రాగునీరు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కేజీబీవీ పాఠశాల లో విద్యార్థుల కోసం తయారుచేసిన మధ్యాహ్న భోజనాన్ని విద్యార్థులతో కలిసి రుచి చూసారు. విద్యార్థులతో ప్రత్యక్షంగా మాట్లాడి ఇప్పటి నుండే ఇష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఖాన్ అకాడమీ తరగతులను ఐఎఫ్ బి ల ద్వారా విద్యార్థులు వీక్షించడాన్ని పర్యవేక్షంచారు. అనంతరం టెన్త్, ఇంటర్ విద్యార్థుల కు బోటనీ అంశాలను బోధించి సందేహాలను నివృత్తి చేసాడు. మధ్యాహ్న భోజన తనిఖీలో నూతన మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎస్ఓ కు సూచించారు. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేందుకు మెనూ ప్రకారం ప్రతి రోజు



పౌష్టికాహారం ఇవ్వాలని, ఆహార పదార్థాలు నాణ్యంగా ఉండేలా చూడాలన్నారు.వంట కోసం తాజా కూరగాయలు, నాణ్యత గల సరుకులు మాత్రమే వినియోగించాలన్నారు. సరుకుల రిజిస్టర్ ను పరిశీలించారు. వంటశాల ప్రదేశం, వంట పాత్రలు ఎప్పుడూ శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు. యుడైస్ ఎంట్రీలు సమయానికి అప్‌డేట్ చేయాలని సూచించారు. పాఠశాల పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉండేలా చూసుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ గుంటి గోపీలత ఉపాధ్యాయురాళ్లు రేణుక, నిఖిల, పుష్ప, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాలనూ, భావాలనూ పంచుకునే ఓ జ్ఞానపథం

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

జనగామ, ఆగష్టు 02 (నమస్తే ఉదయం): జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ జన్మదినం సందర్భంగా... శనివారం ఓ విశిష్ట కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభించారు పుస్తకాంజలి పేరుతో.. ప్రభుత్వ పాఠశాలల గ్రంథాలయాలను పుస్తకాలతో నింపి...కళకళలాడే పరిసరాలుగా మార్చే దిశగా కలెక్టర్ అడుగు వేసారు. ఇందులో భాగంగా... ఎమ్పియూపిఎస్ యశ్వంతపూర్ పాఠశాలలో పుస్తకాలను బహుకరించి, విద్యార్థులకు పఠనపు అలవాటును అభివృద్ధి చేయడమే లక్ష్యంగా శుభారంభం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...."ప్రతి విద్యార్థి లైబ్రరీ పుస్తకాలను ఆసక్తిగా చదివేలా ప్రోత్సాహించాలన్నారు పుట్టినరోజులు, వివాహాలు, పదోన్నతులు వంటి శుభ సందర్భాలను పాఠశాలలకీ, పిల్లల అభ్యున్నతికీ అంకితం చేస్తూ పుస్తకాల దానం చేయాలని" పిలుపునిచ్చారు. కొన్ని సందర్భాల్లో పాఠశాల లైబ్రరీ కోసం ఖర్చు చేసి పుస్తకాలు కొనుగోలు చేయాల్సిన అవసరం



కలెక్టర్ జన్మదిన సందర్భంగా పుస్తకాంజలి పేరుతో యెశ్వంతపూర్ పాఠశాలలో నూతన కార్యక్రమం.

ఉండకపోవచ్చని... ఎందుకంటే చాలామంది ఇంట్లో ఇప్పటికే చదివి ఓ మూలన ఉంచిన పుస్తకాలు ఉ ంటాయని.... వాటిని మళ్లీ చదివే అవకాశం లేకపోతే అలాంటి పుస్తకాలను పాఠశాల లైబ్రరీకి అందించగలిగితే, అవి చిన్నారుల భవిష్యత్‌కు ఎంతో ఉపయోగకరంగా మారుతాయని కలెక్టర్ సూచించారు.

అంతేకాక, లైబ్రరీలు... పిల్లలకు బోరుగా కాకుండా, ఆసక్తి రేకెత్తించే స్థలాలుగా మారాలన్నారు ఈ దిశగా, అక్కడ రంగుల చిత్రాలతో నిండిన కథల పుస్తకాలు, ఇంగ్లీష్ శబ్ద సంపద (వొకాబులరీ) షీట్స్, నైతిక విలువలతో కూడిన నీతి కథలు, కామిక్స్, పదకోశాలు (డిక్షనరీలు), అలాగే అందరు అంగీకరించే శాస్త్రీయ భావనలతో మూఢనమ్మకాలను తొలిగించే విజ్ఞాన శాస్త్ర పుస్తకాలు ఉంటే పిల్లలు మరింత ఆసక్తితో చదవగలరని తెలిపారు. ఇలాంటి లైబ్రరీలు విద్యార్థుల్లో పఠనాభిరుచి పెంపొందించే ప్రక్రియకు మెరుగైన ఆరంభం అవుతాయని...పుస్తకం ఒక్కటీ చదివినా మార్పు మొదలవుతుందన్నారు. ఒక పాఠశాల గోడల్ని దాటి, జీవితాన్ని మార్చగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుందని.. పుస్తకాంజలి కేవలం పుస్తకాలను బహుకరించడమే కాక, చదువు పట్ల నిబద్ధత, భావితరాలకు జ్ఞానం బహుమతిగా అందించాలన్న ఉన్నత సంకల్పానికి ప్రతిరూపం కానున్నది. ఈ కార్యక్రమం లో ఏఎమ్ఓ శ్రీనివాస్, జీసీడీఓ గౌసియా బేగం, హెడ్ మాస్టర్ దివాకర్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు



క్యాంటీన్ ప్రారంభం అనంతరం మాట్లాడుతున్నా హైకోర్టు జడ్జి, జనగామ జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జూకంటి అనిల్ కుమార్

# జనగామ జిల్లా కోర్టులో క్యాంటీన్ ప్రారంభించిన హైకోర్టు జడ్జి

### సత్వర న్యాయంలో భాగంగా కేసులను త్వరగా పరిష్కరించేందుకుగాను న్యాయవాదులు సహకరించాలి

### హైకోర్టు జడ్జి, జనగామ జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జూకంటి అనిల్ కుమార్

జనగామ,ఆగష్టు 02 (నమస్తే ఉదయం): జనగామ జిల్లా కోర్టు ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన క్యాంటీన్, జిరాక్స్ సెంటర్ ను హైకోర్టు జడ్జి, జనగామ జిల్లా పోర్ట్ పోలియో జడ్జి జూకంటి అనిల్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.వృత్తి పరంగా ఎదురయ్యే సవాళ్ళని ఎదుర్కనే క్రమంలో కలిగే ఒత్తిడిని కోర్టు ఆవరణలో వదిలిపెట్టి ఇంటికి ప్రశాంతమైన మనసుతో వెళ్లాలని న్యాయవాదులకు సూచించారు. బార్ -బెంచ్ సమన్వయంతో పనిచేసి కేసులను స్పీడి డిస్పోజల్ చేయడంలో సహకరించాలని కోరారు. జిల్లా కేంద్రంలోని చంపక్ హిల్స్లో 10 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేయనున్న కోర్టు నిర్మాణ పనులకు పరిపాలన అనుమతులు త్వరలోనే రానున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో జిల్లా ప్రిన్సిపల్ జడ్జి ప్రతిమ, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్,సీనియర్ సివిల్ జడ్జిలు విక్రమ్, సుచరిత, జూనియర్ సివిల్ జడ్జి శశి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు దండబోయిన హరి ప్రసాద్ యాదవ్, ప్రధాన కార్యదర్శి పాలకుర్తి రామకృష్ణ, సీనియర్ న్యాయవాదులు ప్రసాద రావు, జాన్ రెడ్డి,శ్రీరాం శ్రీనివాస్, పానుగంటి శ్రీనివాస్, డిఫెన్స్ న్యాయవాది మంచాల రవీందర్ కోట శంకర్ తదితరులు పాల్గొన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్నాపడం లాల్ నెగి జాయింట్ సెక్రటరీ(మినిస్ట్రీ అఫ్ సివిల్ ఏవియేషన్)లి

# దేవాదుల ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులు, ఇంజనీరింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

### పడం లాల్ నెగి జాయింట్ సెక్రటరీ(మినిస్ట్రీ అఫ్ సివిల్ ఏవియేషన్)

జనగామ, ఆగష్టు 02(నమస్తే ఉదయం): ఢిల్లీ నుంచి వచ్చిన పడం లాల్ నెగి జాయింట్ సెక్రటరీ( మినిస్ట్రీ అఫ్ సివిల్ ఏవియేన్ ) శనివారం దేవాదుల ప్రాజెక్ట్ పనుల పురోగతి ని జిల్లా కలెక్టరెట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హల్ లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశమయ్యి పనులు ఏ ఏ పనులు... ఏ దశలోఉన్నాయో తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ దేవాదుల ప్రాజెక్టు పనుల పురోగతి ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో దాదాపు 2 లక్షల,56 వేల ఎకరాలకు సాగునీరు అందించే ఉద్దేశంతో ప్రారంభించిన దేవాదుల ప్రాజెక్టు పనులు 85 శాతం పూర్తయ్యాయని.. త్వరలో మిగతా వాటిని కూడా పూర్తి చేస్తామన్నారు. మొత్తం 3 విడతలుగా చేపట్టిన ఏడు ప్యాకేజిలకు సంబంధించిన పనులు త్వరగా అయ్యేలా క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు రివ్యూ చేస్తూ.పర్యవేక్షిస్తున్నామన్నారు. ఈ సమావేశం లో సిడబ్ల్యూసి డైరెక్టర్ శ్రీనివాస్, కేంద్ర జల వనరుల సైంటిస్ట్ గౌతం , ఇరిగేషన్ ఎస్ఈ సుధీర్, ఈఈ ప్రవీణ్, వినయ్ బాబు, మంగ్లీ లాల్, డి ఈ, ఏ. ఈ లు పాల్గొన్నారు




# జలమండలిలో 11 మంది ఉద్యోగులు పదవీ విరమణ

ఖైరతాబాద్, ఆగస్ట్ 2(నమస్తే ఉదయం)జలమండలి పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పనిచేస్తున్న 11 మంది ఉద్యోగులు పదవీ విరమణ పొందారు. వీరందరిని ఖైరతాబాద్ లోని ప్రధాన కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. పదవీ విరమణ ద్వారా లభించే గ్రాట్యూటీ వంటి తదితర ప్రయోజనాలు చెక్కు రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో పర్సనల్ డైరెక్టర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్, సీజీఎం సురేష్, ఉద్యోగులు పాల్గొన్నారు.

# హైదరాబాద్ డెంటల్ షోలో అక్షరా రెడ్డి, నికితకి మొదటి బహుమతి

హైదరాబాద్, ఆగస్టు2(నమస్తే ఉదయం) ఇండియన్ డెంటల్ అసోషియేషన్ నిర్వహించిన హైదరాబాద్ డెంటల్ షో లో పోస్టర్ ప్రెజెంటేషన్ విభాగంలో పానసీయ డెంటల్ కళాశాల విద్యార్థులు.. రామకృష్ణాపురంకు చెందిన ఎం.అక్షర రెడ్డి, హైదరాబాద్ కు చెందిన ఎం.నికిత ప్రథమ బహుమతి సాధించారు.. ఆగస్టు 2,3 తేదీలలో హైదరాబాద్ హైటెక్స్ లో జరిగే షోలో మొదటి రోజు పోస్టర్ ప్రజంటేషన్ కార్యక్రమం జరిగింది. ప్రజంటేషన్ లో ప్రథమ బహుమతి సాధించిన అక్షర రెడ్డి, నికితకి కార్యక్రమంలో సర్టిఫికెట్ ప్రధానం చేశారు. అక్షర రెడ్డి, నికితను వారికి సలహాలు, ప్రోత్సాహం అందించిన డా కార్తీక్ బసను జడ్జీలు, ఐడియే సభ్యులు అభినందించారు.







వంటలను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటేశ్వరరావు

# నమస్తే ఉదయం ఎఫెక్ట్

## పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

గద్వాల జిల్లా ప్రతినిధి,ఆగస్టు 2 (నమస్తే ఉదయం)కేటిదొడ్డి మండలం ఉమిత్యాల తండా ఎంపీపీఎస్ స్కూల్ మద్యాహ్న భోజనం అందక విద్యార్థుల పస్తులు అనే శీర్షికతో ఓ కథనం శనివారం "నమస్తే ఉదయం" దినపత్రికలో వెలువడింది. స్పందించిన కేటిదొడ్డి ఎంఈఓ వెంకటేశ్వర రావు శనివారం ఉమిత్యాల తండా ఎంపీపీఎస్ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. మద్యాహ్న భోజనం ఎందుకు అందడంపై ఆరా తీశారు. భోజన శాలకు వెళ్లి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహర నాణ్యతను స్వయంగా పరిశీలించారు. భోజనం రుచిగా ఉందా అ ని విద్యార్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతూ విద్యార్థులు తినే భోజనం వండే సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. అదేవిధంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని నిర్వాహకులకు తెలిపారు. భోజనం నాణ్యత విషయంలో ఎటువంటి ఫిర్యాదులు వచ్చిన ఉపేక్షించే పరిస్థితి లేదని హెచ్చరించారు. ఎంఈఓ వెంటా హెచ్ఎం వినోద్, సీఆర్పీలు యుగేందర్ పాపయ్య, విద్యావాలంటీర్ నరేష్, తదితరులు ఉన్నారు.

# ఫేక్ అటెండెన్స్ నమోదు చేసిన ఇద్దరు పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసిన జిల్లా కలెక్టర్

గద్వాల జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2 (నమస్తే ఉదయం)మల్దకల్ మండలంలోని విఠలాపురం గ్రామ పంచాయతీ కార్యదర్శి తిరుమలేష్ మరియు గట్టు మండలంలోని బోయలగూడం గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ లు ఫేక్ డీఎస్ఆర్ అటెండెన్స్ నమోదు చేసినందున సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ బిఎం సంతోష్ శనివారం ఉత్తర్వులు జారిచేశారు.కలెక్టర్ ఆదేశాల ప్రకారం, జిల్లాలోని ప్రతి పంచాయతీ కార్యదర్శి ప్రతి రోజు ఉదయం 11:00 గంటల లోపు తప్పనిసరిగా లైవ్ డిఎస్ఆర్ ఫేస్ రికగ్నైజేషన్ యాప్ లో నమోదు చేయవలసిందిగా ఆదేశించారు.లైవ్ డీఎస్ఆర్ నమోదు చేయకపోతే లేదా ఫేక్ డీఎస్ఆర్ నమోదు చేసినచో కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీ కార్యదర్శులు పూర్తి బాధ్యతతో, సమయానికి తమ విధులను నిర్వహించగలరని కోరారు.



# అమృత పథకానికి భూమి పూజ చేయరా?

### బిజెపి ఆధ్వర్యంలో నిరసన

కొత్తకోట, ఆగస్టు2(నమస్తే ఉదయం)కేంద్రంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం కొత్తకోట పట్టణానికి మెరుగైన మంచినీటి సౌకర్యం కల్పించాలన్న సదుద్దేశంతో 15 కోట్లు 2023న విడుదల చేసింది. గత ప్రభుత్వం ఆ పనులను చేయకుండానే దిగిపోయింది.మీరు అధికారంలోకి వచ్చి దాదాపు 19 నెలలు కావొస్తుంది. ఎందుకు ఆ పనులకు భూమి పూజ చేయడం లేదు.? పాలమూరు ఎంపీ డీకే అరుణ ఇప్పటికే రెండు పర్యాయాలు ఈ పనులు ప్రారంభించడానికి సమయం ఇస్తే, మీరు సమయం ఇవ్వకుండా తప్పించుకుంటున్నారు. లోగడ మీ నిధులు కానివాటికి ఎంతో అట్టహాసంగా భూమి పూజలు, శిలాఫలకాలు రెండు, రెండు సార్లు చేశారు. 15 కోట్ల కేంద్ర పనులను ఎందుకు భూమి పూజ చేయకుండా అలసత్వం వహిస్తున్నారు. 2023 లో %ఖఖీ×ణజ% క్రింద 30 పడకల ఆసుపత్రిమంజూరి అయింది. ప్రస్తుతం నిర్మిస్తున్న హాస్పిటల్ 30 పడకలా?లేక 50 పడకల ఆసుపత్రియా ప్రజలకు తెలియాలి. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు వనపర్తి శ్రీనివాస్ రెడ్డి, కొమ్ము భరత్ భూషణ్, స్టార్ బాలు రాఘవేందర్ రెడ్డి, అమరేందర్ రెడ్డి, యాదిరెడ్డి, రమేష్ చారి, సురేష్ గౌడ్, శ్రీనివాసులు, తిరుపతి సాగర్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాదుల కాల్వల నీరు రైతులు వృధా చేయకుండా ఉపయోగించుకోవాలి

### మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్



రైతులతో కెనాల్ కల్వలను పరిశీలిస్తున్నా శివరాజ్ యాదవ్

జనగామ, ఆగష్టు 02 (నమస్తే ఉదయం): జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, జనగామ నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి సూచన మేరకు జనగామ మండలంలో ఉన్న కెనాల్ కాల్వల ద్వారా వచ్చే నీరు వృదా చేయకుండా చూడాలి కాల్వ దగ్గర్లో,కాల్వ కింద ఉన్న రైతులకు పలు సూచనలు ఇచ్చిన జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్. ఈ సందర్భంగా శివరాజ్ యాదవ్ మాట్లాడుతూ.. జనగామ నియోజక వర్గంలోని ప్రతి చెరువులకు కాల్వల ద్వారా నీరు వచ్చే విధంగా నీటిపారుదల శాఖ అధికారులతో ఎప్పటి కప్పుడు నియోజకవర్గ ఇంచార్జ్ కొమ్మూరి ప్రతాప్ రెడ్డి చొరవ తీసుకొని ప్రతి గ్రామంలో రైతులకు పంటలకు సాగు నీరు అందేవిధంగా చూస్తున్నారని అన్నారు.అదేవిధంగా కాల్వల ద్వారా వచ్చే నీరు వృదా చేయకుండా క్రమ క్రమంగా నీటిని వాడుకోవాలని(ఉపయోగించుకోవాలని )అన్నారు.అదేవిధగా కాల్వల ను ఎవ్వరు ఎక్కడ అనవసరంగా తవ్వకుండా చూసే బాధ్యత కాల్వల దగ్గర ఉన్న రైతులే చూసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్ రైతులకు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో జనగామ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మెరుగు బాలరాజు, ఏఎంసీ డైరెక్టర్ నామాల శ్రీనివాస్,నాయకులు శివరాతి కుమారస్వామి, ఓబుల్ కేశ్వపూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు జనార్దన్ రెడ్డి,కొమురయ్య, యూత్ కాంగ్రెస్ నాయకులు పిడుగు రమేష్, ప్రవర్ధన్,రాజు,మల్లేష్ ఆయా గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.




# చదువుల ఒత్తిడితో పాఠశాల నుంచి పారిపోయిన బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చిన బాలనగర్ సీఐ

కూకట్‌పల్లి, ఆగస్టు 2 (నమస్తే ఉదయం)చదువుల ఒత్తిడిని తట్టుకోలేక పాఠశాల నుంచి పారిపోయిన ఓ 12 ఏళ్ల బాలికను బాలానగర్ సీఐ నర్సింహా రాజు రక్షించి ఆమె తల్లికి అప్పగించారు. ఈ సంఘటన శనివారం బాలానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ నర్సింహా రాజు తెలిపిన వివరాల ప్రకారం చింతల్ చెరుకుపల్లి కాలనీకి చెందిన శివారెడ్డి, నాగలక్ష్మి దంపతుల కుమార్తె చంద్రిక (12), లిటిల్ స్కాలర్ హైస్కూల్లో 6వ తరగతి చదువుతోంది. శనివారం ఉదయం తల్లిదండ్రులు పనికి వెళ్లగా చంద్రిక స్కూల్‌కు బయలుదేరింది. అయితే సరిగా మార్కులు రావడం లేదని ఉపాధ్యాయులు మందలించడంతో మనస్తాపం చెందిన బాలిక స్కూల్‌కు వెళ్లకుండా ఒంటరిగా రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తోంది. ఈ క్రమంలో అటుగా వెళ్తున్న సీఐ నర్సింహా రాజు ఫుట్‌పాత్‌పై రోదిస్తూ వెళ్తున్న బాలికను గమనించి ఆపారు. ఆమెతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం బాలిక తల్లి నాగలక్ష్మిని పిలిపించి, బాలికకు కౌన్సెలింగ్ ఇచ్చి తల్లికి అప్పగించారు. సీఐ నర్సింహా రాజు సమయస్ఫూర్తితో వ్యవహరించడంపై స్థానికులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of VANITHA Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: M.DAMODHAR REDDY. "RNI. Title- Code: TELTEL/2023/87699**. Cell: 9492148733